సాక్షి
తిరుపతి

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



శ్రీకాళహస్తిలో ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ (ఇన్‌సెట్) శేష, యాళి వాహనాలపై ఊరేగుతున్న శివపార్వతులు

అశేషం..శివోహం!

అంగరంగ వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

- ఉదయం హంస, శుక వాహనాలపై శివపార్వతుల విహారం
- రాత్రి శేష, యాళి వాహన సేవలు



పురవీధుల్లో హంస, శుక వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు శేష వాహనంపై, అమ్మవారు యాళి వాహనంపై ఆశీనులై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. మొదట స్వామి, అమ్మవార్లను ఆలయ అలంకార మండపంలో సర్వాంగసుందరంగా అలంకరించారు. మేళ తాళాలు, మంగళ వవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకుని రాజగోపురం వద్దకు వేంచేశారు. అక్కడ స్వామి వారిని శేష వాహనంపై, అమ్మవారిని యాళి వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

మహాశివరాత్రి (మాఘ బహుళ త్రయోదశి)

వాహన సేవలు

ఉదయం 10.30 గంటలకు : ఇంద్ర విమానం – చప్పరం

ఉభయదాతలు: సి.సత్యనారాయణ, అడ్వకెట్, శ్రీకాళహస్తి

రాత్రి 9.30 గంటలకు– నంది – సింహ వాహన సేవ

ఉభయదాతలు : దక్షిణ భారతదేవాంగ సంఘం వారిచే పట్టు వస్త్రాల సమర్పణ

వెంకటగిరి రాజావారు, వెంకటగిరి, తిరుపతి జిల్లా

యద్దనపూడి వెంకటసుబ్రహ్మణ్యశర్మ , స్వరాజ్య లక్ష్మి జ్ఞాపకార్థం

కె.దయానందగుప్తా, బజారువీధి, శ్రీకాళహస్తి

టీఎస్.రామగుప్తా, అరుణా మెడికల్స్, శ్రీకాళహస్తి

హంస, శుక వాహనాలపై ఆదిదంపతుల పురవిహారం

ఐదో రోజైన మంగళవారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామి బంగారు హంస వాహనంపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు శుక వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసే సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప కొలవుదీరి స్వామి, అమ్మవార్లను అనుసరించారు. కళాకారుల కోలాటాలు, శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తీశ్వరునికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతులమీదుగా పట్టు వస్త్రాలు అందజేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఈఓ బాపిరెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి , కలెక్టర్

న్యూస్‌రీల్

తెప్పోత్సవాలకు సన్నద్ధం



తెప్పోత్సవ ఏర్పాట్లలో ఇంజినీరింగ్ విభాగం

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 9 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో శ్రీవారి పుష్కరిణి సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులు పుష్కరిణిలోని మండపం వద్ద ఉత్సవాలకు కావలసిన ఏర్పాట్లను మొదలుపెట్టారు. త్వరలోనే పుష్కరిణిలో నీటిని తొలగించి మరిన్ని పనులు చేపట్టనున్నారు.

7న స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వివిధ విభాగాల మహిళా ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని ఎస్వీ వైద్యకళాశాల క్రీడా ప్రాంగణంలో మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు నిర్వహిస్తున్నామని.. ఈ పోటీల్లో పాల్గొంటున్న మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు మార్చి 7న స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు కలెక్టర్‌కు వివరించారు. ఆ మేరకు మంగళవారం వారు వినతిపత్రాన్ని అందించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి..అన్ని విభాగాల జిల్లా అధికారులకు ఆ మేరకు ఆదేశాలు ఇవ్వడానికి అంగీకరించారని మహిళా ఉద్యోగులు వెల్లడించారు. వారితోపాటు ఏపీ జేఏసీ తిరుపతి నగర చైర్మన్ ఎస్.సురేష్‌బాబు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8వ తేదీన ఎస్వీ వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, లలిత్ కుమార్, హేమగిరి, పద్మజ, వివిధ సంఘాల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ మండలం నుంచి ఓ వ్యక్తికి మూడు రోజులుగా జ్వరం తగ్గకపోడంతో రుయా ఆస్పత్రికి తీసుకొచ్చారు. జ్వరంతో పాటు తలనొప్పి, నీరసం, ఒళ్లునొప్పులు ఉండడంతో వైరల్ ఫీవర్‌గా భావించి మెడిస్ తీసుకున్నారు. కానీ శరీర ఉష్ణోగ్రత రోజు రోజుకూ పెరగడంతో ఆందోళనలో పడ్డారు. దీంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా స్క్రబ్ టైఫస్‌గా వైద్యులు నిర్ధారించారు. గత నాలుగు రోజులుగా ఆయనకు ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు.



జ్వరమా.. జాగ్రత్త సుమా!

జిల్లాలో పెరుగుతున్న స్క్రబ్ టైఫస్ కేసులు

- సాధారణ జ్వరంగా లైట్ తీసుకుంటున్న ప్రజలు
- జ్వరం తీవ్రతరం కావడంతో ఆస్పత్రిని ఆశ్రయిస్తున్న రోగులు
- నిర్లక్ష్యం వహిస్తే ప్రధాన అవయవాలపై ప్రభావం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

తిరుపతి తుడా: తిరుపతి జిల్లాలో స్క్రబ్ టైఫస్ కోరలు చాస్తోంది. మొదట సాధారణ జ్వరంగా ప్రారంభమై బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ స్వైరవిహారం చేస్తోంది. ప్రజలు సాధారణ జ్వరమని తేలిగ్గా తీసుకుంటే ప్రమాదం తప్పదని వైద్యయంత్రాంగం హెచ్చరిస్తోంది. దీని ప్రభావం శరీరంలోని అన్ని వయవాలపై పడుతుందని హెచ్చరికలు జారీ చేస్తోంది. అవగాహన లోపంతో ప్రజలు స్క్రబ్ టైఫస్ అనే టెర్రర్‌ను ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. జిల్లాలో ఈ వ్యాధికి సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ అవగాహన కల్పించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వాస్పత్రుల్లో వ్యాధినిర్ధారణ పరీక్షలు, కిట్లు అందుబాటులో ఉంచేందుకు సన్నద్ధమవుతోంది.


స్విమ్స్‌లో నమోదైన స్క్రబ్ టైఫస్ కేసులు	
నెల	కేసుల సంఖ్య
డిసెంబర్	20
జనవరి	11
ఫిబ్రవరి	17

అవగాహన కల్పించాలి

జిల్లాలోని తిరుపతి, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో పలువురికి స్క్రబ్ టైఫస్ లక్షణాలతో జ్వరం భారిన పడుతున్నారని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు చెబుతున్నారు. అంతటి ప్రమాదకరమైన వ్యాధిపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి, గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణ జ్వరంలా కనిపించే స్క్రబ్ టైఫస్‌ను సకాలంలో గుర్తించకుంటే ప్రాణాలు సైతం ప్రమాదంలో పడుతాయని చెబుతున్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం పొందడం ద్వారా ఎలాంటి ప్రభావం చూపకుండా బయటపడొచ్చని సూచిస్తున్నారు.

స్క్రబ్ టైఫస్ వైరస్ అంటే!

స్క్రబ్ టైఫస్ వైరస్‌ను బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ బుష్ టైఫస్ అని కూడా అంటారు. ఇది చిమ్మటలా కనిపించే చిగ్గర్ అనే ఒక రకం కీటకం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ కీటకం కుట్టినప్పుడు చర్మం ఎర్రబారడం, దురదరావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కుట్టడం వల్ల ఓరియోంటియా సుసుగాముషి అనే బ్యాక్టీరియా దేహంలోకి ప్రవేశిస్తుంది. దీంతో స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్ వస్తుంది. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూముల పక్కన నివసించే వారికి ఎక్కువగా స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. చెట్లు, పొలాల్లో ఉండే ఈ కీటకం కుట్టడం ద్వారా జ్వరం వస్తుంది. ఈ కీటకాల్లో కొన్ని తీవ్రమైన ప్రభావం చూపుతాయి. కొందరికి వారం రోజుల వ్యవధిలో వ్యాధి సోకుతుంది. మరి కొందరిలో కొన్ని గంటల వ్యవధిలోనే తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇలాంటి వారి శరీరంపై పరిశీలిస్తే కీటకం కుట్టిన ప్రాంతంలో నల్లటి మచ్చ కనిపిస్తుంది.



లక్షణాలు ఇలా..

- స్క్రబ్ టైఫస్ సోకిన వారిలో శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉంటుంది
- నాలుగురోజులైనా జ్వరం తగ్గదు
- తీవ్రమైన చలి, తలనొప్పి, ఒళ్లునొప్పులు, నీరసం వస్తుంది
- మరికొందరిలో పొడిదగ్గు వచ్చే అవకాశం ఉంది
- వ్యాధి ముదిరిన వారిలో కామెర్లు, ఫిట్స్ వంటి లక్షణాలు కనిపిస్తాయి

వ్యాధి వ్యాప్తి చెందితే కలిగే పరిణామాలు

- న్యూమోనైటీస్, ఊపిరితిత్తులపై ప్రభావం
- ఎక్యుట్‌రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ సంక్రమించే ప్రమాదం
- కిడ్నీలు ఫెయిల్యూర్, హృదయ కండరాలు వాపు, అంతర్గత రక్తస్రావం
- తెల్లరక్తకణాలు తగ్గిపోవడం, కాలేయం, మూత్ర పిండాల పనితీరు అసాధారణ స్థితికి చేరుకోవచ్చు


ఆలస్యం చేస్తే పెనుముప్పు



మైట్ కాటుతో ఏడు నుంచి పది రోజుల తర్వాత తీవ్రమైన జ్వరం వస్తుంది. తలనొప్పి బాధిస్తుంది. చాలామంది సాధారణ జ్వరం, తలనొప్పేనని నిర్లక్ష్యం చేస్తారు. స్క్రబ్ టైఫస్ నిర్ధారణ అయిన తర్వాత వీలైనంత త్వరగా చికిత్స ప్రారంభించాలి. ఆలస్యం చేస్తే అవయవాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. స్క్రబ్ టైఫస్ అనేక అంటు రోగాలతో మిళితమై గందరగోళానికి దారితీస్తుంది. రోగులలో రోగ నిర్ధారణకు సెరోలాజిక్ పరీక్షను నిర్వహించవచ్చు. ఎస్సార్ లేదా పాలిమరేస్ చైన్ రియాక్షన్ బయాప్సీని కూడా రోగనిర్ధారణకు ఉపయోగించవచ్చు. దీనిపై రోగులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

– పీ.లోకేష్‌రెడ్డి, ప్రముఖ జనరల్ ఫిజీషియన్, తిరుపతి

నిర్లక్ష్యం చేయొద్దు



జ్వరం రెండు, మూడురోజులకంటే ఎక్కువ ఉంటే కచ్చితంగా డాక్టర్లను సంప్రదించాలి. పరీక్షలు చేసుకుని జ్వరానికి గల కారణాలను నిర్ధారించుకోవాలి. వీటిని లెక్కచేయకుండా రెండు మందు బిల్లలు మింగితే తగ్గిపోతుందనుకోవడం కరెక్టు కాదు. అలసత్వం వహించి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు. జ్వరాలలో స్క్రబ్ టైఫస్ ఒకటి. ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే ఊపిరితిత్తులతో పాటు ఇతర ప్రధానమైన అవయవాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ వ్యాధి వచ్చిన వారి శరీరంపై మచ్చలను గమనించవచ్చు.

– డాక్టర్ వరప్రసాద్, సీనియర్ వైద్యులు, తిరుపతి

డీఎల్‌పీఓ, ఈఓపీఆర్డీలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ సుశీలాదేవి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి జిల్లాలోని డీఎల్‌పీఓ, ఈఓపీఆర్డీలకు రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రంలో మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం పై ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూ పీసీ జిల్లా కో–ఆర్డినేటర్ శిరీష, జిల్లా రిసోర్స్ పర్సన్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో తడి చెత్త– పొడి చెత్త, స్వచ్ఛ సంకల్ప చెత్త నుంచి సంపద కేంద్రం నిర్వహణపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని డీపీఓ సుశీలాదేవి పరిశీలించారు. ఈఓపీఆర్డీలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలు విధిగా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరమ్మ, కార్యదర్శి రమేష్‌బాబు, డీఎల్‌పీఓ, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లకు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



జీవీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌ఐఓ, తిరుపతి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు తిరుపతి జిల్లావ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో పటిష్టంగా నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించిన ప్రశ్నపత్రాలు ఇదివరకే తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలకు చేరుకున్నాయి. వీటిని సోమవారం, మంగళవారం నాడు జిల్లాలోని ఆయా పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న 20 పోలీస్ స్టేషన్లకు పటిష్ట బందోబస్తు నడుమ చేరవేసినట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష నిర్వహించే రోజు ఆయా సబ్జెక్టు ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రాలకు కస్టోడియన్లు చేరవేయనున్నట్లు చెప్పారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఆర్ఐఓ తెలిపారు.

శివ శివా!



ఆలయం అంతా పసుపు రంగు లైట్లే

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇష్టారాజ్యం

- పాలకమండలికి బదులు సేవా కమిటీ ఏర్పాటు
- టెండర్లు లేకుండానే శివరాత్రి పనులు
- కేవలం 50వేల మందికే శివరాత్రి ప్రసాదం
- ప్రొటోకాల్ పాటించని అధికారులు



ప్రొటోకాల్ మరిచి స్వామి భక్తి చాటుకున్న ఆలయ అధికారులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి:శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మహాశివరాత్రి ఏర్పాట్లలో కూటమి నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడుగడుగునా రాజకీయ జోక్యంతో రాజ్యమేలుతున్నారు. ధనార్జన.. ప్రచార్భాటమే ధ్యేయంగా ఆలయ, దేవదాయశాఖ అధికారులు ముందుకు సాగుతున్నారు. కోట్ల రూపాయలతో చేపట్టే మహా శివరాత్రి ఏర్పాట్లు ఎటువంటి టెండర్లు పిలువకనే నామినేషన్ కింద పూర్తి చేస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో కూడా రాజకీయ రంగు పులుముతున్నారు. అధికారులు కూటమి నేతల కనుసన్నల్లో నడుచుకుంటూ ఆలయ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. శివరాత్రి వేడుకల ఏర్పాట్ల విషయంలో అడుగడుగునా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తమ్ముళ్ల కోసమేనా?

మహా శివరాత్రి ఏర్పాట్లకు సంబంధించి 20 రోజులకు ముందే ఆలయ అధికారులు టెండర్లు పిలిచేవారు. టెండర్లు దక్కించుకున్న వారు శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఒక రోజు ముందే పనులుపూర్తి చేసేవారు. అయితే ఈ సారి శివరాత్రి ఏర్పాట్లకు సంబంధించి ఎటువంటి టెండర్లు పిలువలేదు. అన్నీ నామినేషన్ పనుల కిందే కూటమి నేతలు పంచుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలా చేపట్టిన పనులు మంగళవారం కూడా కొనసాగాయి. గతంలో ఆలయ గోపురం ముందు ప్రత్యేకంగా కైలాసం సెట్, ఆధ్యాత్మికతకు సంబంధించి ప్రత్యేక ఆకృతులతో ఏర్పాటు చేసేవారు. ఈ సారి అటువంటివేవీ కనిపించడంలేదు. బ్రహ్మోత్సవాల కోసం ప్రతి ఏటా ఫొటోలు, వీడియోల బాధ్యతలను స్థానికులకు రూ.5 లక్షలతో పనులు అప్పగించేవారు. ఈ ఏడు రూ.15 లక్షలు కేటాయించి.. హైదరాబాద్ నుంచి పిలిపించుకున్నారు. దూర్జటి కళాప్రాంగణంలో ప్రతి రోజూ ప్రముఖ బృందం చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ ఏడు అటువంటి ప్రముఖులను పిలిపించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

సేవా కమిటీ పేరుతో పెత్తనం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధర్మకర్తల మండలి నియామకం వాయిదా వేశారు. ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సేవా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తరులు జారీచేసింది. ఆ కమిటీ మార్చి 6 వరకు కొనసాగనుంది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అందర్నీ సమన్వయం చేసుకొని పాలక మండలి కూడా వేసుకోలేని పరిస్థితిలో ఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముదిరిన పచ్చ పైత్యం

ఏ ఆలయంలో అయినా.. రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మాత్రం అందుకు భిన్నంగా ఏర్పాటు చేశారు. ఆలయంలో మొత్తం పసుపు రంగు కనిపించేలా విద్యుత్ దీపాలను అలంకరించారు. శివరాత్రి పర్వదినాన స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు పండు, రుద్రాక్ష, లడ్డూ ప్రసాదంగా పంపిణీ చేసేవారు. ఈ ప్రసాదానికి అయ్యే ఖర్చు మొత్తం గతంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి భరించారు. అయితే ఈ ఏడు ఆలయ నిధులతో రవిక, పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేయనున్నట్లు తెలిసింది. అయితే ఈ ప్రసాదం కేవలం 50 వేల మందికే సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కూటమి నేతలు, ఆలయ అధికారులు శివరాత్రి రోజున 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని చెబుతుంటే.. ప్రసాదం మాత్రం 50వేల మందికే సిద్ధం చేయడం వెనుక ఆంతర్యమేమిటో అర్థంకావడంలేదు. ఇదిలా ఉంటే.. మహా శివరాత్రి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎక్కడా ప్రొటోకాల్ పాటించలేదు. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఫొటోలు లేవు. మరో వైపు ఫ్లెక్సీల్లో ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫొటో కింద దేవదాయశాఖా మంత్రి అని రాయడం విస్మయానికి గురిచేస్తోంది.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.89,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,098

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,700
రిటైల్ వెండి గ్రాము	రూ.101.70

క్లుప్తంగా

అశ్వ వాహనంపై రాజసం

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో మాహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు మంగళవారం అశ్వ వాహనం పై ఊరేగుతూ స్వామివారు భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామి వారు, పల్లకీలో అమ్మవారు ఊరేగుతూ భక్తులను సమ్మోహనపరిచారు. ఉభయదారులుగా ఊత్తుకోట్టైకి చెందిన ఎంఆర్.తమిళరసన్, టీ.మోహన్ వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. గ్రామోత్సవంలో కోలాటం, భజనలు, భరతనాట్య నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

రేపు ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 50 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డీఫార్మసీ, బీఫార్మసీ, ఎమ్‌ఫార్మసీ చదివిన అభ్యర్థులు అర్హులని, ఆసక్తిగల వారు గురువారం ఉదయం 10గంటకు వర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అటవీశాఖ భూముల్లోకి వస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్వో సుహాసిని

బాలాయపల్లి(సైదాపురం): అటవీశాఖ భూముల్లోకి వస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఓ సుహాసిని హెచ్చరించారు. బాలాయపల్లి మండలం, అలిమిలి గ్రామంలో సర్వే నం.4లో ఉన్న భూమి ఆక్రమణలపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే నం.4లో ఉన్న భూమిలో సగం వరకే అటవీశాఖకు సంబంధించిందని, ఆ భూముల్లోకి వస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అలిమిలి గ్రామస్తులు మాట్లాడుతూ రెవెన్యూశాఖ అధికారులు అకారణంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు వాపోయారు. ఫారెస్ట్ బీట్ అధికారి భవానిఅశోక్, రహంతుల్లా పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకన్న రథోత్సవం



అశ్వవాహన సేవలో నటుడు మంచు మోహన్‌బాబు



గోవిందనామస్మరణతో స్వామివారి దివ్యరథాన్ని లాగుతున్న భక్తులు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన మంగళవారం స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా దివ్యరథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనం ఇచ్చారు.

అశ్వ వాహనంపై వెంకన్న రాజసం

మంగళవారం రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మితో పాటు ఆలయ సిబ్బంది తరఫున స్వామి వారికి వివిధ రకాలైన పండ్లు, పూలను సమర్పించి, సర్కారు హారతిని అందుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చక్రస్నాన కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 నుంచి 10.20 గంటల మధ్య ఆలయ పుష్కరిణిలో అర్చకులు వైఖానస ఆగమోక్తకంగా నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య జరిగే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

పీ-4 సర్వే వేగవంతం



మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: పీ4 సర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. పీ4 సర్వే చేస్తున్న ఉద్యోగులకు మండల పరిధిలో ఎంపీడీఓలు, పట్టణ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6ఏళ్ల పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలన్నారు. ఆయుష్మాన్ భవ పథకం ప్రస్తుతం ఏబీహెచ్ఏ హెల్త్‌కార్డుగా మార్చారని, ఇందులో నమోదు చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తింపజేస్తుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందాలని చెప్పారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, డీపీఓ సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, సర్వేవిభాగం జిల్లా అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

- రుయాలో చికిత్స

తిరుపతి తుడా: ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికను బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం తిరుపతి రుయాకు తరలించారు. రాపూరు సమీపంలోని కండిగుంటకు చెందిన 15 మంది శివభక్తులు సోమవారం కాలినడకన అటవీ మార్గంలో రైల్వే కోడూరు మీదుగా తలకోనకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు భక్తులపై దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా పలువురు తీవ్రగాయాలపాలయ్యారు. అందులో మహాలక్ష్మి (16) బాలికను చికిత్స నిమిత్తం రుయాకు తీసుకొచ్చారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై చర్యలు

కోట: విధుల్లో అలసత్వం వహించిన ఐదుగురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ గోపి మంగళవారం తెలిపారు. డీఎల్‌డీఓ నిర్వహించిన సమావేశానికి హాజరు కాకపోవడం, సమయపాలన పాటించక పోవడం తదితర కారణాలతో చిట్టేడు, కేసవరం, గూడలి, కోట పంచాయతీ కార్యదర్శులతోపాటు కోట-3 సచివాలయం కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు వెల్లడించారు.

ఫార్మా స్యూటికల్స్‌దే కీలకపాత్ర



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: మానవుని ఆరోగ్య సంరక్షణలో ఫార్మాస్యూటికల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. ఎస్వీయూ ఫార్మసీ కళాశాల 8వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుషుల ఆరోగ్యం కాపాడడంలో డాక్టర్ల తర్వాత ఫార్మాస్యూటికల్ విభాగందే కీలకం అన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడడంలో ఫార్మసీ విద్యార్థులు భాగస్వామ్యులు కావడం భగవంతుడు కల్పించిన గొప్పవరమని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపల్ ఓవీఎస్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి, శరత్ బాబు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సైనికుని ఇంట్లో చోరీ



మాజీ సైనికుడు జగదీశ్వరనాయుడు ఇంటిని పరిశీలిస్తున్న సీఐ చిన్నగోవిందు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం పంచాయతీ, మిలటరీ కాలనీకి చెందిన మాజీ సైనికుడు జగదీశ్వరనాయుడు ఇంట్లో దొంగలు పడ్డారు. విలువైన బంగారం, వెండి వస్తువులు దోచుకెళ్లారు. ఈనెల 22వ తేదీ చిత్తూరులో తన కుమార్తె ఇంట జరిగిన శుభకార్యంలో పాల్గొనేందుకు జగదీశ్వరనాయుడు, తన భార్య భాగ్యలక్ష్మితో కలసి ఇంటికి తాళం వేసుకుని వెళ్లారు. తరువాత మంగళవారం తిరిగి ఇంటికి చేరుకోగా అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించారు. అనంతరం పోలీసుల సమక్షంలో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా అల్మారాలో బట్టల దగ్గర దాచిపెట్టిన ఒక తులం బంగారు కమ్మలు, మంచం కింద దాచిన రూ.70 వేలు నగదు, 500 గ్రాముల బరువు కలిగిన వెండి గ్లాసులు, దీపపు స్తంభాలు, వెండి పళ్లెం, కామాక్షి దీపం, వెండి పూల బుట్టలను దొంగలు దోచుకెళ్లినట్టు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

ముగిసిన క్రీడా సాంస్కృతిక సమ్మేళనం



సాంస్కృతిక విభాగంలో ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచిన తిరుపతి జోన్ ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వేదికగా గత మూడు రోజులుగా ఉత్సాహంగా కొనసాగిన క్రీడా సాంస్కృతిక సమ్మేళనం మంగళవారం ముగిసింది. ఎన్జీరంగా వర్సిటీ పరిధిలోని సుమారు 5 కళాశాలల నుంచి విచ్చేసి అధ్యాపకులు పలు విభాగాల్లో జరిగిన క్రీడల్లోనూ, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభ చాటారు. కార్యక్రమానికి వర్సిటీ డీన్ డాక్టర్ కరుణాసాగర్, కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. మానసిక ఒత్తిడిని జయించడంలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. అధ్యాపకులు క్రీడలను తమ దినచర్యలో భాగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. పలు విభాగాల్లో జరిగిన క్రీడా పోటీల్లో వ్యవసాయ వర్సిటీకి చెందిన కృష్ణాజోన్ ఉద్యోగులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలువగా, సాంస్కృతిక విభాగంలో జరిగిన పోటీల్లో తిరుపతి జోన్ ఉద్యోగులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సుమతి, కళాశాల విద్యార్థి వహారాలు ఇన్‌చార్జ్ డాక్టర్ ఎంఎస్వీ చలం, పీడీ రవికాంత్‌రెడ్డి, రాష్ట్రంలోని పలు కళాశాల నుంచి విచ్చేసిన సుమారు 200 అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్వాసన దిశగా అడుగులు

దీర్ఘకాలిక సెలవులో రుయా వైద్యులు

- 14 మందిని గుర్తించి నోటీసులు ఇచ్చిన అధికారులు
- అయినా స్పందించని డాక్టర్లు
- విధుల నుంచి తొలగింపునకు మొదలైన చర్యలు

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న ప్రభుత్వ వైద్యులను గుర్తించి ఉద్వావసన పలికే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2023 లోనూ దీర్ఘకాలిక సెలవుల పై ఉన్న వైద్యులపై అప్పటి ప్రభుత్వం వేటు వేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమూ అదే దారిలో నడుస్తోంది. ఇటీవల రుయాలోని 9 మంది వైద్యులను తొలగించారు. అలాగే మరో 14 మందికి ఈనెల 10వ తేదీన డీఎంఈ నోటీసులు జారీచేశారు. 15 రోజుల్లో అంటే 24వ తేదీలోపు వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. 14 మంది వైద్యుల్లో కేవలం ఇద్దరు మాత్రమే స్పందించారు. తాము సెలవు పై ఉండడానికి కారణాలను ప్రభుత్వానికి వివరించారు. మిగిలిన వారు స్పందించలేదు. వారిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

స్పందించని వైద్యులు

రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలిక సెలవు పై ఉన్న 91 మందిని గుర్తించారు. అందులో 11 మంది తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్, రుయాలో వైద్యులు ఉన్నారు. ఈనెల 10వ తేదీన వీరందరికీ నోటీసులు వెళ్లాయి. కొంతమంది వైద్యులు ఈ నోటీసులకు స్పందించకపోవడం సంచలనంగా మారింది. నోటీసులకు సమాధానం ఇవ్వకపోవడంతో అధికారులు డీఎంఈకి దీనిపై నివేదించారు. 14 మంది వైద్యుల్లో కేవలం ఇద్దరు మాత్రమే స్పందించగా.. మిగిలిన వారిని తొలగించడం అనివార్యంగా మారింది.

ఆ 14 మంది వీరే

ఎస్వీ మెడికల్ కళాశాలలో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న 14 మంది వైద్యులు వివరాలు ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో చిన్నపిల్లల విభాగానికి చెందిన జీ.సాయిప్రసన్న, దిలీప్ సత్య, రామగణేష్, జనరల్ సర్జరీ విభాగానికి చెందిన అజయ్ బాబు, అజగముత్తు, న్యూరాలజీ విభాగానికి చెందిన గంటా రాజశేఖర్, నెఫ్రాలజీ విభాగానికి చెందిన డాక్టర్ పావని, ఓబీజీ విభాగానికి చెందిన తనూజ, గీతావాణి,వంశీ ప్రియ, మంజూయాదవ్, రేడియో థెరపీ విభాగానికి చెందిన ఆర్ముగం, జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన రంగనాథం, సైకియాట్రీ విభాగానికి చెందిన రాధాకృష్ణ రాజు ఉన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

సత్యవేడు: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నికల్ పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాయాలనుకునే వారికి ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైందని, ఈసారి తిరుపతి జిల్లాలో తిరుపతి, గూడూరుతోపాటు సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల ఎగ్జామ్ సెంటర్‌గా ఉంటుందన్నారు. దరఖాస్తు కూడా ఉచితంగా చేయిస్తామన్నారు. www.policet.ap.nic.in వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారితోపాటు ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాసేవారు కూడా పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, బీసీ, ఓసీ విద్యార్థులు అయితే రూ.400 ఫీజు చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు వందశాతం ఉద్యోగం గ్యారెంటీ అన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న దశరథరామి రెడ్డి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్య నిర్వాహణాధికారి మంజుల, డీ.హోస్మని ఆదేశాల మేరకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఔషధ, సుగంధ మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యాన అధికారి బీ.దశరథరామి రెడ్డి, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ఎస్.శ్రీనివాసులు, కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డా.జ్ఞానేశ్ పాల్గొన్నారు. దశరథరామి రెడ్డి మాట్లాడుతూ ఉద్యానశాఖ వారు ఔషధ, సుగంధ పంటల సాగుపై రైతులకు రాయితీలు ఇస్తున్నట్టు తెలిపారు. సుగంధ పంటలపై 40 శాతం రాయితీతో ప్రాసెసింగ్ యూనిట్లు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఏ.పద్మజ, ఆయుష్ వైద్యాధికారి సీ.శశిరేఖ, కే.కృష్ణమూర్తి, ఔషధ పంట ఉత్పత్తుల కొనుగోలుదారు శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఔషధ మొక్కల బోర్డు సిబ్బంది విజయకుమార్, కృష్ణ, ప్రణీత పాల్గొన్నారు.

భక్తులను మోసగిస్తే చర్యలు

తిరుమల: శ్రీవారి భక్తులను దర్శనాల పేరుతో మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు హెచ్చరించారు. టీటీడీ పీఆర్వో అని చెప్పుకుంటూ ప్రసాద్ అనే పేరుతో చెలామణి అవుతూ చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని తిరుమల సమాచారం అనే గ్రూప్ ద్వారా ఎన్ఆర్ఐ భక్తుల నుంచి శ్రీవారి దర్శన టికెట్ల ఆశజూపి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఎన్ఆర్ఐ భక్తుడు గోపాల్ రాజు చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. విజిలెన్స్ వింగ్ సిబ్బంది బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో నిందితుడు హైదరాబాద్ లోని ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జావేద్ ఖాన్ గా గుర్తించారు. ఈ మేరకు తిరుమల టూ టౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నం. 18/2025తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోకేశా..ఇది కనిపించలేదా?



గత వీసీ శ్రీకాంత్‌రెడ్డిపై దాడి చేస్తున్న కూటమి నేతలు

తిరుపతి సిటీ: కూటమి అధికారంలో వచ్చిన మరుక్షణమే ఎస్వీయూలో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు వీసీ చాంబర్‌లోకి చొరబడి అసభ్య పదజాలంతో దాడిచేశారు. అప్పటి వీసీ శ్రీకాంత్‌రెడ్డిపై వాటర్ బాటిళ్లు, ఫైళ్లను విసిరేస్తూ మీడియా సాక్షిగా దాడి చేసిన దృశ్యాలు ప్రసారమాధ్యమాల్లో ప్రచారమయ్యాయి. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు వర్సిటీ వీసీలపై జరిగిన దాడులపై గళమెత్తారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ సమాధానం ఇస్తూ సాక్ష్యాలు ఇవ్వండి విచారణ చేపడతామంటూ మాట్లాడడంపై నిపుణులు, విద్యావంతులు విస్మయం వ్యక్తం చేశారు. ఇందుకు ఎస్వీయూలో ఆరోజు జరిగిన ఘటన గుర్తులేదా మంత్రివర్యా..అంటూ పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

జింక మృతి



జింకను తరలిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. తిరుమల ఫారెస్ట్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి నుంచి తిరుపతికి వెళ్లే ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద గుర్తు తెలియని వాహనం జింకను ఢీకొట్టింది. దీంతో జింక అక్కడికక్కడే మృతిచెందింది. అధికారులు జింక కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ హాస్పిటల్‌కు తరలించారు.

గ్లోరీ క్వీన్‌గా ఎన్ఎస్‌యూ విద్యార్థిని



గ్లోరీ ఫెస్టివల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో ఇటీవల నిర్వహించిన గ్లోరీ ఫెస్టివల్-2025 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీల్లో జాతీయ సంస్కృత వర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోక్ డ్యాన్స్, స్కిల్, మోనోయాక్షన్, లైట్ మ్యూజిక్, ఓకల్, క్లాసిక్ డ్యాన్స్, ఇన్‌స్ట్రుమెంటల్ విభాగాల్లో వర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. అలాగే గ్లోరీ క్వీన్‌గా సమన్విత కె నంబూతిరి ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

మోటార్ సైకిల్ దొంగల అరెస్ట్

- తొమ్మిది బైకులు స్వాధీనం



మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల చోరీ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను స్థానిక పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పట్టుబడిన వ్యక్తులతో కలిసి పోలీసులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో ఇటీవల బైక్ చోరీలు పెరిగాయన్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ కాలనీకి చెందిన ఇంట్లా మహింద్ర (19), షేక్ ఉజామ(23), మండల పరిధిలోని కుదిరి పంచాయతీ టిటి కట్ల గ్రామానికి చెందిన కంకి వంశీని అరెస్ట్ చేసినట్టు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి తొమ్మిది బైకులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీటి విలువ రూ.6.65 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.